క్లుప్తంగా

సుబ్రమణ్యేశ్వరుడికి వెండి జంధ్యం వితరణ


ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యేశ్వరుడు

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరుడికి వెండి జంధ్యం సమర్పించారు. శనివారం అనంతపురం జిల్లా సింగనమల గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణశర్మ, నాగమ్మ దంపతులు రూ.60వేలు విలువ చేసే ఈ ఆభరణాన్ని ఆలయ అర్చకులు శేషగిరిరావుకు అందించారు. అంతేకాక కృత్తిక నక్షత్రం (స్వామివారి పుట్టిన రోజు) సందర్భంగా అభిషేకం, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సింగనమల సాంబశివుడు, రాఘవరెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు తమవంతు బాధ్యత నిర్వర్తించాలి

సింహాద్రిపురం : విద్యార్థులు సమాజ సేవకు తమవంతు బాధ్యత నిర్వర్తించాలని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. శనివారం బలపనూరు గ్రామంలోని సచివాలయం, ఆలయం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం సింహాద్రిపురం కస్తూర్బా బాలికల విద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మీకాంత, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ యోధుడు లెనిన్

జమ్మలమడుగు : రష్యన్ కమ్యూనిస్టు పార్టీ విప్లవ కారుడు లెనిన్ 153వ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక కమ్యూనిస్టు యోధుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు శివనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, స్వామి, దివాకర్, శ్రీను, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సహరి' దాతకు సన్మానం


రెడ్డికరీంను సన్మానిస్తున్న మత పెద్దలు

కమలాపురం : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వెలసిన మస్జిద్-ఏ-ఫాతిమా నందు రంజాన్ మాసమంతా నెలరోజుల పాటు ఉపవాసాలు పాటించే వారికి సహరి (తెల్లవారుజామున భోజన వసతి) ఏర్పాటు చేసిన మున్సిపల్ కోఆప్షన్, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి కరీంను స్థానికులు సన్మానించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

పోరుమామిళ్ల : రామాయపల్లె ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉదయం 8:30కి శ్రీ జ్ఞాన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట, అనంతరం పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ బైరెడ్డి లక్ష్మిరెడ్డి రూ.40 వేలతో ఈ విగ్రహాన్ని చేయించారన్నారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా విద్యార్థులతో కోలాటాలు, ఏకపాత్రాభినయాలు, కూచిపూడి నాట్యాలు, తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాలు, మ్యాజిక్ షో తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందన్నారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరవారిపల్లెలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్ పరిచారకుడు చాపాటి సుబ్బారెడ్డి రామాయణంపై ప్రవచనలను భక్తులకు వినిపించారు. శుక్రవారం కుంకుమ పూజ, శనివారం కల్యాణంతో కార్యక్రమాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటలక్షుమ్మ, లక్ష్మీదేవి, సిద్దమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల హర్షం

ప్రొద్దుటూరు : ప్రైవేటు పాఠశాలల గుర్తింపును మూడేళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచినందుకుగాను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయని అపుస్మ పట్టణాధ్యక్షుడు కె.దేవీప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలకు విన్నవించారని ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 38ని జారీ చేసిందన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ఈద్ ముబారక్ తెలుపుకున్న ముస్లింలు



పులివెందులలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ విశిష్టతను వివరించారు. అలాగే పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో పట్టణం, వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు చేశారు. ఈ మాసంలో యాచకులకు దాన ధర్మాలు చేయడం, ఫిత్రా చేయడంవల్ల పుణ్యఫలం దక్కుతుందన్నారు. అనంతరం ముస్లింలు ఆలింగం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. తమ ఇంటి వద్ద విందు భోజనాలు ఏర్పాటు చేసి బంధు, మిత్రులను ఆహ్వానించారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, తుమ్మలపల్లె, రాయలాపురం గ్రామాల్లో ముస్లింలు ఉదయాన్నే మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అచ్చివెళ్లి, ఎర్రిపల్లె గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వేంపల్లెలో.. వేంపల్లె : ముస్లింలు స్థానిక ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు తమ బోధనలు వినిపించారు.

వేముల : మండల వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వేల్పుల, వేముల గ్రామాల్లోని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. గురిజాల, బిదినంచర్ల, బలపనూరు, కోవరంగుంటపల్లె, లోమడ తదితర గ్రామాల్లోని ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు రంజాన్ పర్వదినాన్ని విశిష్టతను తెలియజేశారు.ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


వీఎన్‌పల్లె : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లింగాల : మండలంలోని లింగాల, పెద్దకుడాల, పార్నపల్లె, మురారిచింతల, ఇప్పట్ల, చిన్నకుడాల, అక్కులగారిపల్లె, అంబకపల్లె, వెలిదండ్ల తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు

కమలాపురం : మండలంలోని ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గాలవద్ద హాఫిజ్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించారు. ప్రభుత్వ ఖాజీ నాసీర్ హుసేని ప్రత్యేక కుత్బా చదివి వినిపించారు. అనంతరం జాహిద్ హుసేన్ విశ్వ శాంతి కోసం ప్రత్యేక దువా చేశారు. స్థానిక దర్గా-ఏ-గఫారియా, ఖాదరియా నందు పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ప్రత్యేక బయాన్ చేశారు. అలాగే పట్టణంలోని అన్ని మస్జిద్‌లలో ఈద్ నమాజ్ చదువుకున్నారు. మండల పరిధిలోని గంగవరం, విభరాపురం, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, మొలకవారిపల్లె, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, లేటపల్లె, పొడదుర్తి, జీవంపేట ఘనంగా జరుపుకున్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని గ్రామాల్లో ముస్లింలు రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వల్లూరు, కోట్లూరు, తోల్లగంగనపల్లె, దిగువపల్లె తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లారు. పెద్దపుత్త, గణేష్‌పురం, ధర్మాపురంకాలనీ, పైడికాలువ, తొప్పెట్ల తదితర గ్రామాలలోని స్థానికంగా వున్న మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం, వెల్లటూరు, గంగనపల్లె, మొయిళ్లకాల్వ, ఎగువపల్లె, కొండూరు, దర్బార్‌పేట గ్రామాల్లోని ముస్లీంలు నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి నెలవంక కనబడగానే దీక్షలను విరమించి మసీదులకు వెళ్లి ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జమాల్‌పల్లె ఆల్‌మనార్, కొత్త రోడ్డు, మామిళ్ళపల్లె ఈద్గా, ఊటుకూరు ఈద్గా, కొప్పర్తి సమీపంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న ఈద్గా, నవాజ్ కట్ట వద్ద ఉన్న ఈద్గాలలో వేరువేరుగా ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిట్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషాఖాద్రీలు ముస్లింలతో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రెండు రకాతుల వాజిబ్ నమాజ్‌ను, ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ అర్బన్ సీఐ సదాశివయ్యలు ఈద్గా కోసం ఎకరా భూమి దానం చేసిన రసూల్‌ను సన్మానించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని ముద్దనూరు, ఉప్పలూరు, యామవరం, మంగపట్నం గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు బోధించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముస్లీంలు వలసపల్లి రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వీరికి మత గురువు హితోపదేశం అందించారు. అలాగే ఈద్గావద్ద ముస్లింలకు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి ఉచితంగా తాగునీటి బాటిళ్లను పంపిణీ చేశారు. పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటకృష్ణయ్య, ప్రవీన్‌కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు. చిలంకూరు, తిప్పలూరు, పోట్లదుర్తి తదితర ప్రాంతాలలో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని నేలతిమ్మాయపల్లె, ఎస్.పాలగిరి, అనిమెల, గంగిరెడ్డిపల్లె, ఉరుటూరు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యు.రాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


వేంపల్లె ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలలో ముస్లింలు


సింహాద్రిపురంలో ..


వేములలో..


లింగాలలో ..


కమలాపురంలో బయాన్ వింటున్న ముస్లింలు


వల్లూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సీకేదిన్నె : జమాల్‌పల్లెవద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


ఎర్రగుంట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జమ్మలమడుగులో మాట్లాడుతున్న మతగురువు


ముద్దనూరులో పార్థనలు చేస్తున్న ముస్లింలు

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీలో గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థినుల సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయినులతో పూర్వపు విద్యార్థినులు

వేంపల్లె : పట్టణంలోని తలిశెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరం పూర్వపు విద్యార్థినుల శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇప్పుడు ఏమి చేస్తున్నారు, ఎలా ఉన్నారు అంటూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన


ప్రజలకు బ్రోచర్‌ను అందిస్తున్న జడ్పీటీసీ

వేముల : మండల వ్యాప్తంగా గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలు తెలిపారు. వేములలో శనివారం మెయిన్ బజార్, యాదవ బజార్, బూడిద గడ్డ వీధులలో జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రతి కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న సీఎం కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, చలపతి, రాఘవరెడ్డి, రామసుబ్బారెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, గంగాధర, వెంకట శివారెడ్డి, ఎ.గంగిరెడ్డి, కో.ఆప్షన్ సభ్యుడు మండి మాపీరా, మైనార్టీ నాయకులు గౌస్ పీరా, మదార్ వల్లి, డీలర్ గంగిరెడ్డి, పెద్దారెడ్డి, గండి నాగభూషణం, గంగులయ్య, జర్మియా, రాజన్న, సహదేవుడు, నగేష్ పాల్గొన్నారు.

గాలి, వానతో పంటలకు తీవ్రనష్టం

బ్రహ్మంగారిమఠం : మండలంలో శుక్రవారం రాత్రి గాలి, వాన రావడంతో పలు గ్రామాల్లో మిరప, పత్తి, అరటి, బొప్పాయి, మునగ పంటలు తీవ్రంగా దెబ్బతినట్లు రైతులు తెలుపుతున్నారు. మండలంలో లింగాలదిన్నెపల్లె, చెంచయ్యగారిపల్లె, ఎద్దులాయపల్లె, కేశాపురం, ముడుమాల, చౌదరవారిపల్లె, గొడ్లవీడు వంటి గ్రామాల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు చెప్పారు. నష్టపోయిన పంటలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని వారు కోరారు.

వర్షంతో నేలకొరిగి వరి పంట

అట్లూరు : మండల పరిధిలో రెడ్డిచెరువుకింద శుక్రవారం రాత్రి గాలివానకు వరిపంట నేలకొరిగింది. పలు గ్రామాలలో సాగులో ఉన్న పత్తి, వరి, మామిడి పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రక్తదానం

మైదుకూరు : ప్రాణం విలువ తెలిసిన 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 2వ రోజు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు.

స్వర్ణలత, శాంతి అనే ఇద్దరు మహిళలు సైతం రక్తదానం చేయడం విశేషం.కార్యక్రమంలో బ్లడ్ టు లివ్ సంస్థ ప్రతినిధులు తోట కల్యాణ్, పల్లా జయకృష్ణ, తోట మోహన్‌సాయి, రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రస్సెల్, జయచంద్రారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బద్వేలు వాసికి డాక్టరేట్


లక్ష్మీదేవి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఎన్‌జీఓకాలనీలో నివసించే చింతంరెడ్డి లక్ష్మిదేవికి యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్(ధార్వాడ్) డాక్టరేట్, గోల్డ్‌మెడల్ ప్రధానం చేస్తూ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించారు. ఈమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ డాక్టర్ నాగరత్న బిరాదర్ పర్యవేక్షణలో అనాలసిస్ ఆఫ్ ఫీడ్ అండ్ ఫాడర్ స్టేటస్ అండ్ ఫీడ్ బ్యాలెన్స్ షీట్(ప్రోటీన్ అండ్ న్యూట్రియంట్స్)ఇన్ ఇండియా అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించడంతో ఈ అవార్డుకు ఎన్నికయ్యారు. మే నెల చివరి వారంలో జరిగే కాన్వొకేషన్‌లో డాక్టరేట్, గోల్డ్‌మెడల్ అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

25న కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనం ఇస్తూ జీతాలు పెంచాలని ఈనెల 25న కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర డెప్యూటి జనరల్ సెక్రటరీ, జిల్లా ఇంచార్జ్ కేవై దివాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈధర్నాకు జిల్లాలోని అన్ని డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మే డే ఉత్సవాలను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల జన బాంధవుడు జగనన్న


సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల టౌన్ : దివ్యాంగుల జన బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప అన్నారు. శనివారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల హక్కుల చట్టం -2016 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి గెజిట్ విడుదల చేసినందుకు దివ్యాంగులందరూ ధన్యవాదాలు తెలుపుతూ జగనన్న అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప హాజరై దివ్యాంగులతో కలిసి సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంపిణీ చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని దివ్యాంగులకు గిఫ్ట బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ కార్యవర్గ సభ్యులు సునీల్, బషీర్, జగదీష్, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. పులివెందుల పట్టణంలోని రాజా నిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో చిన్నారులు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రతి ఒక్కరిని అలరించాయి. ముఖ్యంగా కాంతారా మూవీలోని పాటకు వేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా అకట్టుకుంది. శిల్పారామ ఏఓ సుధాకర్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, శిల్పారామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండవ శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన కడప రాయుడిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్, మయూరం కృష్ణమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు లక్ష్మిచెన్నకేశవస్వామి వార్షికోత్సవం



సంబటూరులో వెలసిన లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయం, స్వామి మూలవిరాట్

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరు గ్రామంలో వెలసిన లక్ష్మిచెన్నకేశవస్వామి 32వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వాముల వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రి 7గంటలకు స్వామి వారికి ఉయ్యాల సేవ, 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం గంగాధర్ బృందంచే చెక్క భజన నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. అలాగే పాల పండ్ల ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.30,1016, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతుల ను దాతల ద్వారా అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

ఆలయ చరిత్ర :

మండలంలోని సంబటూరులో వెలసిన లక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయం మహాభారత కాలం నాటి అభిమన్యుని మనవడైన జనమేజయ మహారాజు నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. కాలయానంలో ఈ ఆలయం వివిధ రకాలుగా తన రూపు రేఖలను మార్చుకుంటూ పునరుద్ధరణ జరుగుతూ వచ్చింది. చోళ రాజుల కాలంలో కూడా ఈ ఆలయ పునర్నిర్మాణం, విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది. ఈ గ్రామానికి శ్రీ భాష్యపుర అగ్రహారము అని మరొక నామము కలదు. దాదాపు 550 సంవత్సరాల క్రితం ఈ ఆలయ వైభవం గూర్చి శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించి పలు కీర్తనలు రచించారు. అందులోనిదే 'చక్కని ఈ వెన్నుడు సంబటూరి చెన్నుడు' కీర్తన.

విజయనగర ప్రభువైన శ్రీ సదాశివదేవరాయలకు సంతానం లేక బాధపడుతున్నపుడు ఒక రోజు చెన్నకేశవస్వామి రాజుకు కలలో కనిపించి సంబటూరు గ్రామంలో వెలసిన నా దేవాలయాన్ని పునర్నిర్మాణం చేస్తే నీకు సంతానం కలుగుతుందని స్వామి చెప్పగా 1473లో ఈ ఆలయాన్ని పునరుద్ధరణ చేసినట్లు శాసన ఆధారాలున్నాయి. ఆనాటి నుంచి దాదాపు 100 సంవత్సరాల క్రితం వరకు ఏడాదికి రెండు సార్లు మహా వైభవంగా ఉత్సవాలు జరిగేవి. తరువాత పూర్వ వైభవాన్ని సంతరించుటకై 1992 మే 3వ తేదీన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ జరిగింది. 1992 నుంచి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి మహోత్సవాలు ఈ నాటికి ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ నాడు (పుష్పగిరి తిరునాల రోజు) జరుగుచున్నవి. ప్రస్తుతం ఆలయం పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. నాటికి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారిని ఇలవేల్పుగా కొలిచే భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తలనీలాలను సమర్పించు కుంటున్నారు.